సాక్షి గుంటూరు

ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023

I



అన్నదానానికి రూ.లక్ష వితరణ

నరసరావుపేటరూరల్: త్రికోటేశ్వరస్వామి దేవస్థానంలో అన్నదానానికి గుంటూరుకు చెందిన చాపలమాడుగు కవిత తన భర్త వెంకటరావు పేరుపై లక్ష నగదు అందజేశారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4500, గరిష్ట ధర రూ.5600, మోడల్ ధర రూ.5000 వరకు పలికింది.

నాలుగు కరోనా కేసులు



గుంటూరుమెడికల్: జిల్లా వ్యాప్తంగా శనివారం నాలుగు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. లాం, లేమల్లెపాడు, వెంగళాయపాలెం, గుంటూరు అరండల్‌పేటలో ఒక్కొక్కటి చొప్పున కరోనా కేసులొచ్చాయి. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

ఉత్తమ పంచాయతీగా నడింపాలెం

'హెల్దీ పంచాయతీ' థీమ్ కేటగిరీలో ఎంపిక



నడింపాలెం (ప్రత్తిపాడు): రాష్ట్రస్థాయిలో బెస్ట్ పంచాయతీగా 'నడింపాలెం' గ్రామ పంచాయతీ ఎంపికైంది. పంచాయతీల్లో పోటీతత్వం తీసుకురావడంతో పాటు పంచాయతీలను ప్రమోట్ చేసేందుకు ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ రకాల థీమ్‌లను ప్రవేశపెట్టి ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేసింది. పావర్టీ ఫ్రీ అండ్ ఎన్‌హాన్స్‌డ్ లైవ్‌హుడ్ పంచాయతీ, హెల్దీ పంచాయతీ, చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీ, వాటర్ సఫిషియంట్ పంచాయతీ, క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీ, సెల్ఫ్ సఫిషియంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పంచాయతీ, సోషల్లీ సెక్యూర్డ్ పంచాయతీ, పంచాయతీ విత్ గుడ్ గవర్నెన్స్, ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ.. ఇలా తొమ్మిది థీమ్స్‌లో అన్ని జిల్లాల నుంచి బెస్ట్ పంచాయతీలను (ఒక్కో థీమ్ నుంచి మూడు పంచాయతీలు) ఎంపిక చేసింది. అందులో భాగంగా ప్రత్తిపాడు మండలం 'నడింపాలెం' పంచాయతీని 'హెల్దీ పంచాయతీ థీమ్' నుంచి బెస్ట్‌గా ఎంపిక చేశారు. మొత్తం పదిహేను అంశాలను ప్రామాణికంగా తీసుకుని ఎంపికచేసినట్లు గ్రామ పంచాయతీ అధికారులు తెలిపారు.

విజయకీలాద్రిపై తిరుమంజన సేవ



తాడేపల్లిరూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై శనివారం రామానుజుల వారికి తిరుమంజనసేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు తెలియజేశారు. భగవత్ రామానుజుల వారి తిరునక్షత్ర ఉత్సవాల్లో భాగంగా త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళశాసనాలతో ఉదయం తిరుమంజన సేవ, అలంకరణ, తదుపరి గులాబీ పుష్పాలతో సహస్రనామార్చన, అనంతరం తీర్థప్రసాద గోష్టి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రామానుజుల వారి అనుగ్రహాన్ని పొందినట్లు తెలిపారు.

ఏడుగురు ఎస్‌ఐలు బదిలీ

బాపట్లటౌన్: జిల్లాలో ఏడుగురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. బాపట్ల డీసీఆర్‌బీలో ఉన్న జి.వి.చౌదరిని కొరిశపాడుకు, డీసీఆర్‌బీలో ఉన్న పి.నాగశివారెడ్డిని మేదరమెట్లకు, చినగంజాం ఎస్‌ఐగా ఉన్న కె.అనూక్‌ను యద్దనపూడికి, యద్దనపూడి ఎస్‌ఐగా ఉన్న డి.రత్నకుమారిని వీఆర్‌కు, కారంచేడు ఎస్‌ఐగా ఉన్న ఎం.అనితను వీఆర్‌కు, డీఎస్‌బీలో ఉన్న జి.శ్రీనివాస రావును కారంచేడుకు, వీఆర్‌లో ఉన్న కె.సురేష్‌ను చినగంజాంకు బదిలీచేస్తూ జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 523.50 అడుగుల వద్ద ఉంది. ఇది 155.7360 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 5,088, ఎస్‌ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 6,888 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 2,897 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 804.40 అడుగుల వద్ద ఉంది. ఇది 31.2203 టీఎంసీలకు సమానం.



గుంటూరు హిందూ కళాశాల ఈద్గా వద్ద జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే ముస్తఫా, జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ (ఇన్‌సెట్‌లో) ప్రత్యేక నమాజ్ చేస్తున్న ముఫ్తి ముజాయిద్

భక్తిశ్రద్ధలతో రంజాన్

- నగరంలో నాలుగు ఈద్గాలు, మసీదుల్లో ముస్లింల ఈద్ నమాజ్
- రంజాన్ విశిష్టతను వివరించిన మతపెద్దలు



గుంటూరులో నమాజు చేస్తున్న చిన్నారి

పాత గుంటూరు: ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్) వేడుకలను శని వారం ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నా రు. నెలరోజుల ఉపవాసాల అనంతరం శుక్రవారం రాత్రి నెలవంక కనిపించడంతో పండుగ వాతావరణం నెలకొంది. శనివారం ఉదయం నగరంలోని మహమ్మదన్ ఈద్గా, పురాన ఈద్గా, ముస్లిం కళాశాల ప్రాంగణంలోని ఈద్గా, ఐపీడీ కాలనీలోని మహమూదియ ఈద్గా, మసీదుల్లో మత పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక (నమాజ్) ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం చిన్నా పెద్ద పరస్పరం ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. దానధర్మాలు చేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. కులమతాలకు అతీతంగా హిందూ ముస్లింలు ఈద్ ముబారక్ చెప్పుకోవడంతో నగరమంతటా సామరస్యం వెల్లివిరిసింది. పండుగ సందర్భంగా ఇళ్లలో తయారు చేసిన ఖీర్‌ను అందరికీ పంచిపెట్టారు. నెలరోజుల కఠోర ఉపవాస దీక్షలను ముగించి బంధుమిత్రులు, కుటుంబసభ్యులతో కలిసి విందు భోజనాలు చేశారు. అల్లా దయతో అందరికీ మంచి జరగాలని కోరుకున్నారు. పలు సంఘాల ఆధ్వర్యంలో మజ్జిగ, తాగునీటిని ఏర్పాటు చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్రణామం... ప్రణవ పీఠం

- విద్యార్థుల్లో ఆధ్యాత్మిక పెంపుదలకు కృషి
- దేవాలయాల్లో శుభ్రత పనులు
- స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు
- ఆదర్శంగా నిలుస్తోన్న పీఠం



ఆలయాలను శుభ్రం చేస్తున్న ప్రణవపీఠం సభ్యులు

పట్నంబజారు: ప్రణవపీఠం.. పేరులో ప్రణవం - తీరులో ప్రణామం గల ఈ పీఠం ఏరుల మధ్య ఉన్న ఊరు ఏలూరు కేంద్రంగా బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ ఏర్పాటు చేసిన ఒక స్వచ్ఛంద సంస్థ.. దీన్ని ఇలా పిలవడం కంటే ఓ స్వచ్ఛమైన సంస్థ అనడమే సబబుగా ఉంటుంది. ఎందుకంటే ప్రణవం అంటేనే ఓ శక్తి పదం.. విశ్వోద్భవ ఆది ధ్వని ప్రణవనాధం.. సకల చరాచర జీవ కోటి గల ఈ విశ్వంతో మనకు గల సంబంధాన్ని అర్ధం చేసుకుని భ్రాంతి నుంచి విముక్తి పొందడమే ప్రణవ సారాంశం. అటువంటి నిత్య కాంతిధామమైన ప్రణవ నాదంతో నామకరణం అనుసంధానం పొందిన పీఠం. కనుకనే అందులోని సభ్యులంతా స్వచ్ఛమైన మనసుతో... నిర్మలమైన హృదయంతో... నిష్కల్మషంగా ఓవైపు ఆధ్యాత్మికం మరోవైపు ఆపన్నులకు అభయ హస్తం వంటి కార్యక్రమాలు విరివిగా నిర్వహిస్తూనే ఇంకోవైపు బడి-గుడి అనే విలక్షణమైన సేవకు శ్రీకారం చుట్టారు. ఆధ్యాత్మిక చింతన ఎంతో అపూర్వం.. అదీ అందరికీ ఉండాలన్నదే.. మహానుభావుల ఆకాంక్ష.



ప్రణవ పీఠం స్థాపకులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి

2004లో స్థాపన..

ఏలూరు కేంద్రంగా బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ 2004 సంవత్సరంలో ప్రణవ పీఠాన్ని స్థాపించారు. సమాజంలో ఆధ్యాతిక చింతన పెంపొందించాలనే ఉద్దేశంతో పాటుపడ్డారు. దీంతో పాటు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతూ.. ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారు. ఆధ్యాతికతకను పెంపొదించటంతో పాటు.. ఆలయాల పరిరక్షణ.. పరిశుభ్రత.. పాఠశాలల్లో విద్యార్థుల్లో పురాణాల పటిమ పెంచేందుకు పాటుపడుతున్నారు.

గుడి-బడి..

దానిలో భాగంగా 2021లో జనవరిలో గుడి-బడి అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తద్వారా ప్రతి ఆదివారం ఆలయాన్ని మెట్ల దగ్గర నుంచి ఉత్సవ విగ్రహాల వరకు శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టారు. కేవలం పదుల సంఖ్యలో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో.. ఇప్పుడు వేలాది మంది అడుగులు వేస్తున్నారు. ఆలయాల పరిశుభ్రతకు పాటుపడుతున్నారు. ఇదీ కేవలం ఒక ప్రాంతానికో..ఒక ఊరికో పరిమితం కాలేదు. తెలుగు రాష్ట్రాల్లోన్ని అన్ని జిల్లాలతో పాటు, ఆమెరికా, సింగపూర్, మలేషి యా, యూకే, ఆస్ట్రేలియా, కెనడాతో పాటు అనేక ప్రాంతాల్లో సుమారు 6 వేల మంది బృందం ప్రతి ఆదివారం ఆలయాల పరిశుభ్రత, విద్యార్థులకు ఇతిహాసాలను తెలియజేసే పనిలో పడ్డారు. ఇందులో భాగంగా గుంటూరు జిల్లాలో మొత్తం 250 మందితో కూడిన బృందం ఉంది. ఇప్పటి వరకు సుమారు జిల్లాలో 500పైగా ఆలయాల్లో కార్యక్రమాలు చేపట్టారు. సుమారు 200 పైగా పాఠశాలల్లో రామాయణం, భగవద్గీతల గురించి విద్యార్థులకు వివరిస్తున్నారు. వీటితో పాటు శ్రీకృష్ణాష్టమికి చిత్రలేఖనం పోటీలు, వినాయక చవితి రోజు ప్రసంగపు కార్యక్రమాలు నిర్వహించి, ఇలా పర్వదినాల్లో వివిధ కార్యక్రమాలు రూపొందించి చిన్నారుల్లో సైతం భక్తి భావాన్ని పెంపొందిస్తున్నారు. అదేవిధంగా అనేక పాఠశాలల్లో భగవంతులకు సంబంధించిన చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.

సేవల్లోనూ...

ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో విశేష సేవలందించటంతో పాటు సేవా కార్యక్రమాల్లో గుడి-బడి సభ్యులు ముందుకు సాగుతున్నారు. గుంటూరు జిల్లాకు వంశీ అనే యువకుడు, కృష్ణా జిల్లాకు భాగ్యశ్రీ అనే యువతి బృందాలను సారథులుగా వ్యవహరిస్తున్నారు. దానిలో భాగంగా విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, పాఠశాలలు శుభ్రపరచటం, మంచినీటి కేంద్రాలను ఏర్పాటు చేయటంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు శ్రీకారం చుడుతున్నారు.

ఎవరికి వారే.. స్వచ్ఛందంగా

ఆధ్యాత్మిక చింతన, పుస్తకాల పంపిణీ, ఆలయ, పాఠశాలలను పరిశుభ్రంగా చేయటం వంటి కార్యక్రమాలకు గుడి-బడి సభ్యులు స్వచ్ఛందంగా చేపడుతున్నారు. ఏ ఒక్కరి నుంచి రూపాయి ఆశించకుండా ఎవరికి వారే చందాలు వేసుకుని ప్రతి ఆదివారం చీపురు దగ్గర నుంచి భోజనం వరకు స్వంత ఖర్చులతో ఆ ఆలయాలు, పాఠశాలలు శుభ్రపరిచి వస్తున్నారు. ప్రత్యేక పర్వదినాలను పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకునే వారు నేరుగా రావాలని చెబుతున్నారు.

భక్తిభావం వెల్లివిరియాలి



ప్రతి ఒక్కరిలో భక్తిభావం వెల్లివిరియాలని కోరుకుంటున్నాం. మా బృందంలో ప్రతి ఒక్కరి కష్టం ద్వారానే ఇప్పటి వరకు అనేక సేవా కార్యక్రమాలు, ఆలయాల పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాం. మా బృందంలో ఎంతో మంది ప్రభుత్వోద్యోగులు, యువత, విద్యార్థులు, పెద్దలు ఉన్నారు. వారు అందిస్తున్న సహకారం, సాయం మరువలేనిది. ఈ కార్యక్రమాల్లో పాల్గొనదలచిని వారు 9966222934 నెంబరును సంప్రదించగలరని మనవి.

– వంశీ, గుంటూరు గుడి-బడి బృందం సారథి

సేవ చేయటంలో సంతృప్తి



ఎటువంటి స్వార్ధం లేకుండా బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గురువు చెప్పిన సేవా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ఎంతో సంతృప్తి కలుగుతోంది. మన జీవతంలో కనీసం వారంలో ఒక రోజైనా భగవంతుడు, పేదల కోసం వినియోగించి కష్టపడి పనిచేయాలి. తద్వారా భగవంతుడి ఆశీస్సులు అందటంతో పాటు, పేదలకు మంచి చేయగలుగుతాం. కృష్ణాజిల్లాలో ఏదైనా ఆలయం, ప్రభుత్వ పాఠశాలలు బాగు చేసే కార్యక్రమాలు ఉంటే 9010209190 నెంబరును సంప్రదించాలని విజ్ఞప్తి.

– భాగ్యశ్రీ, గుడి-బడి కృష్ణాజిల్లా అడ్మిన్



అక్షయ తృతీయ సందడి బంగారు దుకాణాల్లో శనివారం కనిపించింది. ఒక్క గ్రాము బంగారమైనా కొనుగోలు చేసేందుకు షాపులకు కొనుగోలు దారులు రావడం కనిపించింది. గుంటూరులో పలు దుకాణాలు క్రయ-విక్రయాలతో సందడిగా కనిపించాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

నిత్యాన్నదానానికి విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసిన దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి పలువురు భక్తులు శనివారం విరాళాలు సమర్పించారు. రాజమండ్రి కోదండ రామాలయం ప్రాంతానికి చెందిన చలుమూరు వెంకట మహేష్ కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబును కలిసి నిత్యాన్నదానానికి రూ.1.08 లక్షల విరాళాన్ని అందజేశారు. విజయవాడ ఇస్లాంపేటకు చెందిన ఇట్లా అశోక్‌కుమార్, రమ్యశృతి నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు.

నాబార్డు ఏజీఎం కార్తీక్ బదిలీ

కొరిటిపాడు(గుంటూరు): జిల్లా నాబార్డు అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పనిచేసిన కార్తీక్ లక్నోకు బదిలీ అయ్యారు. ఈ మేరకు శనివారం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి నుంచి ప్రశంసాపత్రాన్ని కార్తీక్ అందుకున్నారు. భువనేశ్వర్‌లో నాబార్డు ఏజీఎంగా పనిచేస్తున్న జి.శరత్‌బాబు గుంటూరు జిల్లా నాబార్డు ఏజీఎంగా నూతనంగా శనివారం బాధ్యతలు స్వీకరించారు. 2017 నుంచి ఇప్పటి వరకు జిల్లా నాబార్డు ఏజీఎంగా ఆరు సంవత్సరాల పాటు పనిచేసిన కార్తీక్ లక్నోకు బదిలీ అయ్యా రు. శరత్‌బాబు భువనేశ్వర్ నుంచి బదిలీపై వచ్చారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 50 పైగా రైతు ఉత్పత్తి సంఘాలను ఏర్పాటు చేయడంలో కార్తీక్ కీలక పాత్ర పోషించి 35 వేల కుటుంబాలకు లబ్ధిని చేకూర్చారు. ఉత్తమ జాతి గేదెల అభివృద్ధి కోసం ప్రత్యేక పథకం అమలు చేయ డం జరిగింది. వివిధ బ్యాంకులతో సమ న్వయం చేసుకొని వేల కోట్ల రూపాయల రుణ సహాయం లబ్ధిదారులకు అందించడంలో కీలకపాత్ర పోషించారు. అంతేకాకుండా వివిధ ప్రభుత్వ శాఖలతో కలిసి పనిచేస్తూ 'నాడు నేడు' గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, రూరల్ డోగౌన్స్‌ల ఏర్పాటు, కోల్డ్‌స్టోరేజీల ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను మల్టీ సర్వీసు సెంటర్లుగా ఏర్పాటు చేయడం కోసం వారికి రైతు భరోసా కేంద్రాల ద్వారా రూరల్ గోడౌన్లు, కోల్డ్ స్టోరేజీలు, పెట్రోలు పంపులు నాబార్డు ద్వారా మంజూరు చేయడం జరిగింది. జిల్లా రుణ ప్రణాళిక ఏర్పాటులోనూ తమ సహాయ సహకారాలు జిల్లా ప్రభుత్వ శాఖలకు అందించారు. కార్తీక్ పనిచేసిన కాలంలో ఎన్నో రకాల అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాలను అద్భుతంగా అమలు పరిచారు. వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి వాటిని అమలు పరిచి జిల్లా కలెక్టర్ల అభినందనలు పొందడంతోపాటు ఎనిమిదిసార్లు ఉత్తమ అధికారిగా అవార్డుని స్వీకరించారు.

టాంజానియా యువతికి చికిత్స

- గుంటూరు జీజీహెచ్‌లో వైద్యుల ఘనత
- పసరుతిత్తిలో రాళ్లను తొలగించిన గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు



గుంటూరు మెడికల్: తూర్పు ఆఫ్రికా టాంజానియా దేశానికి చెందిన 21 ఏళ్ల యువతికి గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు అత్యాధునిక వైద్య పరికరంతో చికిత్స చేసి అనారోగ్య సమస్య నుంచి విముక్తి కల్పించారు. జిల్లాలోని ఓ యూనివర్సిటీలో చదువుకునేందుకు టాంజానియా దేశానికి చెందిన 21 ఏళ్ల శారా ఎబేల్‌మోతికా వచ్చింది. కొంతకాలంగా పసరుతిత్తిలో రాళ్లు ఏర్పడి పచ్చకామెర్లు(జాండిస్) తీవ్రమై ఈనెల 14న జీజీహెచ్ గ్యాస్ట్రోఎంట్రాలజీ వైద్య విభాగానికి వచ్చింది. వైద్య విభాగాధిపతి డాక్టర్ అనుముల కవిత, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షేక్ నాగూర్‌బాషా పరీక్షలు చేశారు. పసరుతిత్తిలో ఉన్న రాళ్లు కామన్ బైల్‌డక్ట్ స్టోన్స్ అని నిర్ధారించి యువతిని వార్డులో అడ్మిట్ చేసుకుని ఈనెల 19న అత్యాధునిక వైద్య పరికరం ఎండోస్కోపీ ద్వారా పసరుతిత్తి రాళ్లను విజయవంతంగా తొలగించారు. సాధారణంగా ఊబకాయం ఉన్నవారిలో, కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నవారిలో, డీహైడ్రేషన్‌కు గురైనవారిలో ఇలాంటి రాళ్లు ఏర్పడతాయని డాక్టర్ నాగూర్‌బాషా తెలిపారు. చికిత్స కోసం తమ వద్దకు వచ్చిన టాంజానియా యువతికి కొలెస్ట్రాల్, ఊబకాయం ఉండటం వల్ల పసరుతిత్తిలో రాళ్లు ఏర్పడ్డాయన్నారు. శనివారం ఆస్పత్రి నుంచి యువతిని డిశ్చార్జి చేస్తున్నామన్నారు.

26 నుంచి జాతీయ స్థాయి ఆహ్వాన నాటికల పోటీలు

- వైఎస్సార్ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహణ..
- వైఎస్సార్ లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డుల ప్రదానం
- హాజరుకానున్న రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి రోజా



నాటికల పోటీల బ్రోచర్ ఆవిష్కరించిన నిర్వాహకులు

తెనాలి: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నాటక కళాపరిషత్ జాతీయస్థాయి ద్వితీయ నాటిక పోటీలు ఈనెల 26వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో నాటికల పోటీల బ్రోచర్‌ను నిర్వాహకులు ఎం.సత్యనారాయణశెట్టి, గరికపాటి సుబ్బారావు శనివారం ఆవిష్కరించారు. తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో ప్రదర్శించనున్న పోటీలను తొలిరోజు రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి రోజా ప్రారంభిస్తారని చెప్పారు. సమావేశానికి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అధ్యక్షత వహించనున్నట్లు పేర్కొన్నారు. అతిథులుగా మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ హాజరవుతారని పేర్కొన్నారు. చివరిరోజున ముగింపు సభలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున పాల్గొంటారని వివరించారు. వివిధ రంగాల్లోని ప్రముఖులైన జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు(లాలుపురం రాము), వైఎస్సార్ సీపీ నేతలు బూరెల నాంచారమ్మ, కొండా శివారెడ్డి, ప్రముఖ సినీదర్శకుడు జి.అశోక్, వంగా లక్ష్మారెడ్డిలకు వైఎస్సార్ లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. పట్టణానికి చెందిన సీనియర్ నృత్య గురువు ఎండీ గిరికి ఆత్మీయ సత్కారం ఉంటుందని వివరించారు. ఆవిష్కరణ కార్యక్రమంలో నిర్వాహక సభ్యులు అయినాల మల్లేశ్వరరావు, ఆరాధ్యుల కన్నా, అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి, కొండపి శ్రీనివాసరావు, లక్కరాజు లక్ష్మణరావు, పిట్టు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తాడికొండ: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం లంక గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. ప్రకాశం జిల్లా యర్రగొండపాలేనికి చెందిన మేడబలిమి మల్లేశ్వరి భర్త ఆది నరసింహులుతో కలసి సుమారు ఆరేళ్ల నుంచి తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం లంక గ్రామానికి వచ్చి కూలీ పనులు చేసుకుంటూ ఇక్కడే నివాసం ఉంటున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు. కాగా మద్యానికి అలవాటు పడిన నరసింహులు 21వ తేదీ బయటకు వెళ్లి ఇంటికి రాలేదు. 22వ తేదీ స్థానికులు పొలాల వద్ద నరసింహులు పడి ఉన్నాడని సమాచారం ఇచ్చారు. వెళ్లి పరిశీలించగా మృతి చెందినట్లు గుర్తించారు. ఒంటిపై దోకుడు గాయాలు ఉండటంతో అనుమానాస్పద స్థితిగా గుర్తించి భార్య మల్లేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సోమేశ్వరరావు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

తెనాలిరూరల్: రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి చెందారు. పోలీసుల కథనం.. కృష్ణకెనాల్ జంక్షన్ సమీపంలో శనివారం రైల్లో నుంచి జారి పడి సుమారు 70 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వృద్ధుడు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు నీలం గళ్ల లుంగీ తెల్ల చొక్కా ధరించి ఉన్నాడు. మరో ఘటనలో తెనాలి రైల్వే స్టేషన్ దక్షిణ కేబిన్ సమీపంలో ఓవర్ బ్రిడ్జి వద్ద సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి ఒంటిపై నల్ల డ్రాయరు మాత్రమే ఉంది. రెండు మృతదేహాన్ని పోలీసులు తెనాలి జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా సెన్సారు సర్టిఫికేషన్‌లో మార్పులు

- పైరసీని అడ్డుకునే నిబంధనలతో త్వరలో చట్టం
- మా-ఏపీ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా

పెదరావూరు(తెనాలి): సెన్సారు బోర్డు సినిమాలకు ఇచ్చే సర్టిఫికేషన్ యూఏ, యూఏలను ఇకపై ఏడేళ్లపైగా, 13 ఏళ్లకు పైగా 16 ఏళ్ల వయసుల వారీగా వర్గీకరణకు కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలిపినట్లు మా-ఏపీ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా వెల్లడించారు. వీటితోపాటు శాస్త్ర, వైద్యరంగ కేటగిరీ సినిమాలకు ఎస్ సర్టిఫికెట్‌ను కొత్తగా సెన్సారు బోర్డు ఇవ్వనుందని శనివారం రూరల్ మండలం పెదరావూరులోని ఫిలిం స్టూడియోలో విలేకరుల సమావేశంలో తెలిపారు. యూఏ సర్టిఫికెట్ ఇచ్చిన సినిమాలను ఇప్పటివరకు పిల్లలు చూడాలంటే పెద్దల వెంట వెళ్లి చూడాలని గుర్తు చేశారు. ప్రస్తుతం సినిమాల వర్గీకరణ బిల్లు పార్లమెంటు ఆమోదానికి రానున్న తరుణంలో యూఏ సర్టిఫికేషన్‌ను వయసుల వారీగా వర్గీకరించినట్లు వివరించారు. ఏయే వయసువారు ఎలాంటి సినిమాలను చూడొచ్చు అనే వర్గీకరణతో పాటు, పైరసీని అడ్డుకునే చట్టాలను ముసాయిదాలో చేర్చినట్టు దిలీప్‌రాజా చెప్పారు. సినిమాటోగ్రఫీ సవరణ చట్టం -2023గా కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తోందని వివరించారు. అలాగే పోర్న్ సైట్లు సెల్‌ఫోన్‌లో రాకుండా నిషేధించే చట్టాన్ని తీసుకురావాలని కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్, సహాయమంత్రి డాక్టర్ మురుగన్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు.

రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌కు రూ.లక్ష విరాళం

నరసరావుపేట: రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌సెంటర్ అభివృద్ధి కోసం తమ వంతు సహకారం అందించేవారు మానవతా దృక్పథంతో ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ కోరారు. శనివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లా బ్లడ్ సెంటర్ నిర్మాణం కోసం అమర కృష్ణమూర్తి అండ్ సన్స్ సంస్థ ప్రొపరేటర్ అమర రాంబాబు రెడ్‌క్రాస్ జిల్లా ప్రెసిడెంట్ అయిన కలెక్టర్‌కు కలెక్టరేట్‌లో రూ.లక్ష చెక్కు విరాళంగా అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ బ్లడ్‌సెంటర్ నిర్మాణం కోసం విరాళమిచ్చిన అమర రాంబాబును అభినందించారు. సొసైటీ జిల్లాలో ఎన్నో సామాజిక సేవ కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. అందులో భాగంగా నరసరావుపేటలో కాంపోనెంట్స్‌తో కూడిన బ్లడ్‌సెంటర్ నిర్మాణం చేపడుతున్నారన్నారు. దీనిద్వారా జిల్లాలో రక్తం కొరత లేకుండా ప్రమాదాల్లో గాయపడిన వారికి త్వరితగతిన రక్తం అందజేసేందుకు అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి, కమిటీ సభ్యులు కేవీఎం ఎన్‌వీ శ్రీనివాస గుప్తా, అమర వెంకటేష్, మోహన్‌రావు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలింత మృతి

- నిరసనగా బంధువుల రాస్తారోకో
- పోలీసుల జోక్యంతో విరమణ



స్వాతి (ఫైల్)

దుర్గి: వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలింత మృతి చెందినట్లు ఆరోపిస్తూ బంధువులు శనివారం నిరసనకు దిగారు. వివరాలు.. మండల పరిధిలోని ముటుకూరు గ్రామానికి చెందిన గర్భిణి కుక్కమూడి అశోక్ స్వాతి(22)కి నెలలు నిండి నొప్పులు రావటంతో మాచర్ల పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. ఈ నెల 18వ తేదీ మంగళవారం వైద్యులు ఆపరేషన్ చేశారు. ఆమె ఓ బిడ్డకు జన్మనిచ్చింది. మూడు రోజులుగా చికిత్సను ఆస్పత్రిలో వైద్యులు కొనసాగించారు. బాలింతకు కాళ్లు, ముఖము, చేతులు వాపులు రావటంతో మెరుగైన చికిత్స నిమిత్తం వైద్యుల సలహా మేరకు గుంటూరు జనరల్ ఆస్పత్రికి తరలించారు. శనివారం ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని ఆమె స్వగ్రామమైన ముటుకూరుకు తరలించారు. కుటుంబ సభ్యులు, బంధువులు వైద్యులు నిర్లక్ష్యం కారణంగా మృతి చెందిందని ఆరోపిస్తూ దుర్గి మెయిన్ రోడ్డులో రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న గురజాల డీఎస్పీ బాధిత కుటుంబ సభ్యులకు నచ్చజెప్పారు. దీంతో రాస్తారోకో విరమించారు.